# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆకాక్షించారు.
- ❖ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష జూన్ 1వ తేదీన జరగనుంది.
- ❖ రాష్ట్రంలోని అన్ని జలాశయాలలోనూ వచ్చే జూన్ వరకు అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

======================

వ్యవసాయం, వైద్యం, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే అంశంపై రాష్ట్ర సచివాలయంలో ఈరోజు కార్యశాలను నిర్వహించారు. ‘ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్’ పేరిట జరిగిన ఈ కార్యశాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సహా నూతన సాంకేతికత వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ఈ కార్యక్రమంలో చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో ఏయే విభాగాలలో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు, ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్‌లో సేవలు అందిస్తామని, స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ.. త్వరలో ‘డేటా లేక్’ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

======================

గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఆకాక్షించారు. “జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం” సందర్భంగా ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. బిల్లులు రాకపోయినా పనులు పూర్తి చేసిన గుత్తేదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల కృషితో గ్రామాలలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. గ్రామ పంచాయతీల పనులకి సంబంధించి ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను నిర్వహించి మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామని పవన్ కల్యాణ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

======================

ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షను జూన్ 1న నిర్వహించబోతున్నామని పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ తెలిపింది. విశాఖపట్టణం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. జూన్ 1వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది రాతపరీక్షను నిర్వహించనున్నారు. 2023 జనవరిలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు 4 లక్షల 59 వేల మంది హాజరుకాగా.. మొత్తం 95 వేల 208 మంది అర్హత సాధించారు. 2024 డిసెంబర్ లో జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాదించిన 38 వేల 910 మంది ఈ మెయిన్స్ పరీక్ష రాయనున్నారు.

======================

రాష్ట్రంలోని అన్ని జలాశయాలలోనూ వచ్చే జూన్ వరకు అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామంలో 2 కోట్ల 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న “జల్ జీవన్ మిషన్” పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

======================

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని 26వ వార్డులో పైలట్ వాటర్ స్కీమ్‌ను గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా తాగునీటి సమస్యలను పరిష్కరించి, సురక్షితమైన నీటిని ప్రజలకు అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రధాన బాధ్యతని, ఈ పైలట్ స్కీమ్ విజయవంతమైతే ఇతర వార్డులలో కూడా విస్తరిస్తామని వెల్లడించారు.

======================

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ రావు మృతదేహానికి ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు నివాళి అర్పించారు. నెల్లూరు జిల్లా కావలి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. మధుసూదన్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

======================

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న గ్రామ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనున్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డితో కలిసి ఈరోజు సభా ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిపాడ్ ఏర్పాటు, సభా వేదిక నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ప్రోటోకాల్ విధుల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. చేపల వేట నిషేధ సమయంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకు అమలులో ఉండే సముద్ర వేట నిషేధం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు భరోసా అందించనుందని కలెక్టర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

======================

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్న పలు రెస్టారెంట్ లలో ఈరోజు జిల్లా ఆహార భద్రతా అధికారి ఎ.ఎస్. రెడ్డి తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్ లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలలో వినియోగించే వంటకాలను క్షుణంగా పరిశీలించారు. తనిఖీలలో చికెన్ నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా వినియోగించడం జరుగుతుందని గమనించి, దానిని పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ లాబరేటరీ కి పంపించామని చెప్పారు. రెస్టారెంట్లలో పలుసార్లు మరిగించిన వంటనూనెను వినియోగించనట్లయితే టీపీసి మీటర్ ద్వారా నిర్ధారించి హోటల్ యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

======================

ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో ఈ నెల 30వ తేదీన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి చందనోత్సవం జరగనుంది. చైత్ర బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు తొలిగంధం అరగతీతకు ఆలయ వర్గాలు శ్రీకారం చుట్టాయి. గంధం చెక్కలకు పూజలు చేసి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు తొలిగంధం చెక్కను అరగదీశారు. చందనోత్సవం రోజున నిజరూప దర్శనం అనంతరం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి సుమారు 125 కిలోల శ్రీ గంధాన్ని సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి తొలివిడతగా సమర్పణ చేస్తారు. కాగా... హిరణ్యాక్షుని సంహరించిన వరాహావతారము, హిరణ్యకశిపుని సంహరించిన నారసింహావతారముల కలయికతో స్వామి వారు సింహగిరిపై శ్రీవరహ లక్ష్మీ నృసింహావతారంగా వెలసినారని భక్తుల ప్రతీక.

======================
======================